వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 282
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
ఆగస్టు 16, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## ముఖ్య నేతల సమావేశంలో ఇనగాల



8లో..




# ఎవరి పంతం వారిదే..!

## ప్రమాదంలో ఫోర్త్ ఎస్టేట్

**గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఎఫ్ఐఆర్‌ల లొల్లి**

**సుబేదారి పోలీసుల అత్యుత్సాహం | రాజీకి అవకాశం ఇవ్వని వైనం**

**సీనియర్ పాత్రికేయులపై కేసులు | జటిలమవుతున్న జర్నలిస్టుల సమస్యలు**





ప్రజాస్వామ్యానికి ఫోర్త్ ఎస్టేట్ గా చెప్పుకునే జర్నలిజం ఓరుగల్లులో ప్రమాదంలో పడింది. సమస్య ఏదైనా సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన జర్నలిస్టులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునేందుకు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లైంది. అయితే సంయమనం పాటించాల్సిన పోలీసులు ఇదే అదనుగా ఇబ్బడి ముబ్బడిగా పాత్రికేయులపై కేసులు నమోదు చేస్తూ తమ అక్కసును వెలిబుచ్చుతున్నారు. రాజీ కుదుర్చుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ సమయం కూడా ఇవ్వకుండా ఎస్సీ, ఎస్టీ కేసులు మొదలుకొని విధులకు ఆటంకం, దౌర్జన్యాలు, బూతులు తిట్టారంటూ ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. గత వారం రోజులుగా హెచ్ 143 యూనియన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యుల మధ్య జరుగుతున్న ఘర్షణలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు అవకాశం ఉన్నప్పటికీ హనుమకొండ ఏసీపీ పి.నర్సింహరావు, సుబేదారి ఇన్ స్పెక్టర్ మేకల రంజిత్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ జర్నలిస్టులతో చదరంగం ఆడుతున్నారు. జర్నలిస్టులతో మాకెందుకొచ్చిన గొడవ అనుకుంటూనే వారిని చక్రబంధంలో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసుల అత్యుత్సాహం కారణంగానే గోరుతో పోయే గొడవ గొడ్డలి వరకు వచ్చిందని పాత్రికేయలోకం అభిప్రాయపడుతోంది. అయితే సమస్యలకు పరిష్కార మార్గం చూపించాల్సిన జర్నలిస్టుల సంఘాలు సైతం ఎవరికి వారు తమ పంతం నెగ్గించుకునేందుకు ఆరాట పడడంతో సమస్య రోజురోజుకూ జఠిలంగా మారుతోంది. నిత్యం జరుగుతున్న పరస్పర గొడవలతో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది.

–వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు2లో..

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని శనివారం హనుమకొండ కుమార్ పల్లికి చెందిన మామిడి శ్రీదీప్ చిన్ని కృష్ణుని వేషధారణలో అలరించారు. ముకుందా.. ముకుందా అంటూ శ్రీదీప్ అందరినీ ఆకట్టు కున్నారు. తల్లిదండ్రులు మామిడి ఉషశ్రీ, ప్రదీప్, అమ్మమ్మ గడ్డం సంధ్యారాణి, తాతయ్య కేశవమూర్తి చిన్ని కృష్ణుడిని అభినందించి, ఆశీర్వదించారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ

8లో..







6లో..

## 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ

బండారు దత్తాత్రేయ స్వీయ రచన

## ఎల్లవేళలా అండగా ఉంటాం

- మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో ప్రజలనుంచి వినతుల స్వీకరణ



8లో..

# ఎవరి పంతం వారిదే..!




- ప్రమాదంలో ఫోర్త్ ఎస్టేట్
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఎఫ్ఐఆర్‌ల లొల్లి
- సుబేదారి పోలీసుల అత్యుత్సాహం
- రాజీకి అవకాశం ఇవ్వని వైనం
- సీనియర్ పాత్రికేయులపై కేసులు
- జఠిలమవుతున్న జర్నలిస్టుల సమస్యలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం జర్నలిస్టులు. అలాంటి జర్నలిస్టులపై కుట్ర జరుగుతోంది. సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచే ఓరుగల్లులో తలెత్తుకు తిరిగినప్పుడే ఆ వ్యవస్థకు తగిన విలువ లభిస్తుంది. గత వారం రోజులుగా ఇక్కడ చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళనకరంగా పరిణమిస్తున్నాయి. ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపించే మనమే ఇతర వ్యవస్థల వారితో చెప్పించుకునే స్థాయికి దిగజారామా అన్న అనుమానం కలిగిస్తోంది. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో మన మధ్య పొడచూపిన విభేదాలు.. అందుకు సంబంధించిన వివాదాలు తీవ్రతరం కావడం జర్నలిస్ట్ కుటుంబాలకు ఆమోదయోగ్యం కాదు. మనకు సమానమైన మూడు ఇతర రంగాలచే మనం చెప్పించుకునే స్థాయికి వెళ్లడం అస్సలు బాగా లేదు. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ వెళితే ఎవరూ మిగలరు. రెండు లేగలు కొట్లాడితే దూడ కాలు విరిగినట్లు సరైన జీతాలు లేక, అడ్వర్టైజ్మెంట్ల టార్గెట్లలో విలవిలలాడుతూ కాలం వెళ్లదీస్తున్న జర్నలిస్టుల పరిస్థితి గొడవల కారణంగా అగమ్యగోచరంగా మారింది. అంతేగాక మెజార్టీ జర్నలిస్టులు నివేశ స్థలాలు రాక, ఇందిరమ్మ ఇండ్లు లేక కిరాయి ఇండ్లలో మగ్గుతూ బతుకులు వెళ్లదీస్తున్నారు. పరిస్థితులు ఇలా ఉంటే.. కొందరు యూనియన్ నేతలు, ప్రెస్ క్లబ్ సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారు. జర్నలిస్టులపై కేసులు ఎవరు పెట్టినా పాత్రికేయుల లోకానికి మంచిది కాదు. అక్రమ కేసులు తాత్కాలికంగా ఉపశమనం కలిగిస్తాయి కానీ, భవిష్యత్తులో అవి నిలబడవు అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇలాంటి దుశ్చర్యలకు ఎవరు పాల్పడినా అది తప్పే. కాబట్టి అలాంటి దుస్సహాసానికి జర్నలిస్టులు సాహసం చేయవద్దు. ఇవాళ మీరు.. రేపు వారు.. ఇలా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ కేసుల కోసం వెంపర్లాడితే అసలు జర్నలిజం ఏం కావాలి. వరంగల్ జర్నలిజం రంగం అంటేనే తలెత్తుకునే జర్నలిజం.. ఆ చరిత్ర ను మనమంతా కొనసాగనిద్దాం.

## కేసుల పరంపర..

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రహరీని ఆనుకొని ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ తొలగింపులో అపస్మృతి జరిగిందని హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్యలపై సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. దీంతో నాగరాజు, సదయ్యతోపాటు మరో ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నెంబర్ 456/2025, తేది 2 ఆగస్ట్ 2025న నమోదైంది. అందుకు ప్రతిగా తమ ప్రెస్ క్లబ్ లో అనుమతి లేకుండా టెంట్ వేసి, ఆందోళన కార్యక్రమాలు చేపట్టి మమ్మల్ని హెచ్చరిస్తూ నానా బూతులు తిట్టారని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అదే సుబేదారి పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టారు. దీంతో హెచ్ 143 ముఖ్య నేతలు బీఆర్ లెనిన్, తుమ్మ శ్రీధర్ రెడ్డి, కక్కెర్ల అనిల్ కుమార్ గౌడ్, గోకారపు శ్యాంకుమార్, బొడిగె శ్రీనుతోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేశారు.




పరస్పరం కేసులు నమోదు చేస్తున్న పాత్రికేయులు (పాత చిత్రం)

## మానసికంగా వేధించారు..

ఇదిలా ఉండగా తనను తుమ్మ శ్రీధర్ రెడ్డి వ్యకృత్వాహననం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అవమానించడం, కించపరడం, మానసికంగా వేధించారని ఐజేయూ రాష్ట్ర నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ కంకనాల సంతోష్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నెంబర్ 471/2025 తేది 15 ఆగస్ట్ 2025న కేసు నమోదు చేశారు.

## గతంలోనే పోలీస్ కేసు..

2018 నుంచి 2022 వరకు నాలుగు సంవత్సరాల పాటు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సదయ్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నెంబర్ 206/2024 తేది 6 ఏప్రిల్ 2024లోనే కేసు నమోదైంది. అయితే కొందరు జర్నలిస్ట్ యూనియన్ల నాయకులు మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి దానిని గాలికి వదిలేశారు. అప్పటి నుంచే గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో వివాదాలు తీవ్ర రూపం దాల్చాయి. అదను కోసం చూస్తున్న కొందరు ఇదే సందర్భంగా భావించి కేసుల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

## అది వేరు..

ప్రస్తుతం ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న వివాదం వేరు.. ఎన్నికలు వేరు. అయినప్పటికీ రెండింటికీ ఒకే గాటికి కట్టడంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఎన్నికలకు ఒక పద్ధతి, సమయం ఉంటుది. కాని, కొందరు ఇష్టారీతిన సోషల్ మీడియాలో ఏది పడితే అది అసభ్యంగా మెసేజ్ లు పెట్టడంతో ఇదంతా జరుగుతోందన్న ప్రచారం సాగుతోంది. జర్నలిస్టుల మధ్య ఏర్పడిన వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోకుండా అహంకారంతో సమస్యలకు మరింత ఆజ్యం పోస్తున్నారు. అనుయాయులు, అనుచరులతో ఘర్షణలకు దిగుతున్నారు. కొందరు పొద్దస్తమానం అక్కడే తిష్టవేసి అసభ్య పదజాలం ఉపయోగిస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. అభ్యంతరకర పదజాలం వాడుతున్నారు. దీంతో ఇటుక మీద ఇటుక పెట్టి ప్రెస్ క్లబ్ భవంతిని నిర్మించిన సీనియర్ పాత్రికేయులు అందులో కాలు మోపాలంటేనే జంకుతున్నారు. అయితే ఇంటా, బయట కొందరు సోకాల్డ్ జర్నలిస్టులు వారిని ఎగదోయడం వల్లే ఈ సమస్యకు పరిష్కార మార్గం కనుమరుగవుతోంది. జర్నలిస్ట్ మిత్రులు కలిసి 'టీ' తాగినప్పటికీ కొందరు చర్చలంటూ అసత్య ప్రచారం చేస్తున్నారు. వివాదాలు ముదిరి పాకాన పడ్డప్పటికీ రాజీ కుదుర్చాలన్న ఆలోచనే ఎవరికి లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికే పరిస్థితులు చేయి దాటి పోయాయి. పెద్దలెవరూ ఇంట్రెస్ట్ చూపే పరిస్థితిలో లేరు. కాని, ఎవరి ఆలోచన సరళి ప్రకారం వారు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ సమస్యను తెగేంతవరకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా సీనియర్ జర్నలిస్టులు లీడ్ రోల్ తీసుకొని సమస్య పరిష్కారానికి మార్గం చూపించాల్సిన అవసరం ఉంది. లేకుంటే అందరి ముందు జర్నలిస్టులు చులకనగా మారే ప్రమాదం ఉందన్న విషయాన్ని ఎవరూ మరువరాదు.

# శ్రీధర్ రెడ్డిని అరెస్ట్ చేయాలి



**మాల మహానాడు జాతీయ కార్యదర్శి బండి అశోక్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ జర్నలిస్ట్ కంకణాల సంతోష్ ను అగ్రకుల అహంకారంతో దుర్భాషలాడిన తుమ్మ శ్రీధర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి బండి అశోక్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని అమరావతి కాన్ఫరెన్స్ హాల్ లో మాలమహానాడు అత్యవసర సమావేశం పనికల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ కార్యదర్శి బండి అశోక్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) రాష్ట్ర కమిటీ మెంబర్, విప్లవ, సామాజిక ఉద్యమ నాయకుడైన కంకణాల సంతోష్ ఎదుగుదలను ఓర్వలేని మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్ రెడ్డి అగ్రకుల దుర అహంకారంతో ఒక వాట్సప్ సమూహంలో దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీధర్ రెడ్డిపై కేసు నమోదు అయినప్పటికీ పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయం అన్నారు. గతంలో శ్రీధర్ రెడ్డి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సొమ్మును అక్రమార్గంలో కాజేశారనే ఆరోపణలతో ప్రస్తుతం ఉన్న ప్రెస్ క్లబ్ కమిటీ పోలీస్ కమిషనర్ కు పిర్యాదు చేసిందని, శ్రీధర్ రెడ్డిపై ఇట్టి విషయంపై కేసు కూడా నమోదు అయ్యిందన్నారు. జర్నలిస్టు నాయకుడి పేరుతో ప్రెస్ క్లబ్ సాక్షిగా జర్నలిస్టుల సొమ్మును మింగిన జర్నలిస్టుల ద్రోహి తుమ్మ శ్రీధర్ రెడ్డి అని ఆరోపించారు. ఇలాంటి నేర ప్రవృత్తి కలిగిన శ్రీధర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, గ్రేటర్ వరంగల్ మాల మహానాడు అధ్యక్షుడు అంకేశ్వరుడు రామచంద్రావు, కొరివి అనిల్, నూనె రాములు, పోతుల కొమ్మలు, సురాసి విక్రం కుమార్, మల్లం రాజ్ కుమార్, పాడుగుల నరసయ్య, వంగేటి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.




# గుంతలు పూడ్చండి

- ఆర్వోబీకి తక్షణమే మరమ్మతులు చేయాలి
- ముక్కెర రామస్వామి డిమాండ్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వై ఆకారంలో నిర్మించిన ఆర్వోబీపై ఏర్పడిన గుంతలకు తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతూ ఎంసీపీఐయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న వై ఆకారం బ్రిడ్జిని నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ వై ఆకారం బ్రిడ్జి 10 సంవత్సరాలు నిండక ముందే బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని ఆరోపించారు. బ్రిడ్జి మొత్తం గుంతల మయంగా మారిందన్నారు. సలాకు, కంకర తేలి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాత్రిపూట వీధిలైట్లు లేక ప్రతిరోజు వేలాదిమంది టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసి బ్రిడ్జిని నిర్మించిన కాంట్రాక్టర్లు నాణ్యతలేని ఐరన్ సిమెంటు తదితర సామాగ్రిని వాడడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందన్నారు. తక్షణమే బ్రిడ్జిని మరమ్మతులు చేసి ప్రజలకు న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగ్గని మల్లికార్జున్, నగర్ కమిటీ సభ్యులు బావు, రామస్వామి, శివ, హమాలి సంఘం నాయకులు అడప యాదగిరి, బిక్షపతి, రాజ్ కుమార్, గట్టయ్య, గుమాస్తా సంఘం నాయకులు రాజేందర్, మనోరు ప్రసాద్ పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

◆ ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి



**వరంగల్ వాయిస్, వరంగల్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆగస్టు 25, 26 తేదీల్లో జరగనున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ.ఐ.యూ.కె.ఎస్.) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఏ.ఐ.యు.కె.ఎస్. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించే పంటలకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులను సకాలంలో అందించడం లేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతాంగమంతా సంఘటితంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసమే ఈ మహాసభను నిర్వహిస్తున్నామని, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అర్షం సుధాకర్, ఉపాధ్యక్షులు మైదం పాణి, సహాయ కార్యదర్శి గట్టికొప్పుల రవి, కోశాధికారి ధార లింగన్న, జిల్లా కమిటీ సభ్యులు బాబురావు, చంటి, కట్కూరి పెద్ద వెంకటస్వామి, చిన్న వెంకటస్వామి, ఉసిల్ల రాజన్న, రమేష్ పాల్గొన్నారు.

# లాదెళ్లలో ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లాదెళ్లలోని రూరల్ హెల్త్ సెంటర్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు అందజేసినట్లు తెలిపారు. అంతేకాక, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ వైద్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె. కిషన్ రావు, డా. మొహమ్మద్ తయార్ మసూద్, సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఎ.గంగాధర్, సతీష్, శ్రీకాంత్, నర్సింహ చారి పాల్గొన్నారు. అలాగే కిట్స్, వరంగల్ విద్యార్థి జి. వర్షిత్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాపా అధ్యక్షుడు ప్రభాకర్ ను సన్మానించిన వైద్యం రాజగోపాల్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ (NAPA) 2025 అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ ప్రభాకర్, మొదటిసారి తన స్వస్థలమైన హనుమకొండ జిల్లాకు విచ్చేశారు. భవాని నగర్‌కు చెందిన ప్రభాకర్ హనుమకొండ నివాసి కావడం జిల్లా పద్మశాలి సంఘానికి గర్వకారణం. హనుమకొండ జిల్లా పద్మశాలి కార్యాలయంలో వైద్యం రాజగోపాల్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండ ప్రభాకర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘానికి అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తానని, సర్వీస్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించడానికి హనుమకొండ జిల్లా సంఘానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణ, అభాగ్యులకు సహాయం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నాపా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న కొండ ప్రభాకర్ విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ పద్మశాలి సంఘానికి సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గోపాల నవీన్ రాజుని కలిసిన మదినేని మల్లేష్



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఇటీవల నియమితులైన మాదినేని మల్లేష్, వరంగల్‌లోని రాంకీలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నాయిని భరత్, మాజీ కార్పొరేటర్ జరితి రమేష్, పీసీసీ రాష్ట్ర నాయకులు మీసాల ప్రకాష్ పాల్గొన్నారు.

# వార్డులను పరిశుభ్రంగా ఉంచాలి

## మాజీ కౌన్సిలర్ సంపత్ కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డు సీఎస్ఐ కాలనీలో మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ పర్యటించి, సానిటేషన్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటింటి చెత్తను స్వచ్ఛ ఆటోల ద్వారా క్రమం తప్పకుండా సేకరించాలి. వీధుల్లోని చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించాలి. దుర్వాసన వస్తున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేసి, వ్యర్థాలను వెంటనే తొలగించాలి. వార్డులో కోతుల, కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో మడికొండ సంపత్ కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు, యువకులు మడికొండ ఐలయ్య, ఇమ్మానియేల్, పాలకుర్తి భాస్కర్, జవాన్ మంద మహేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ హెడ్ కానిస్టేబుల్ గా యాకుబ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రజాసేవలో నిబద్ధత క్రమశిక్షణ, నిజాయితీని పాటిస్తూ, సమాజ శాంతి, భద్రత కోసం అంకితభావంతో పనిచేయటంతో మహబూబాబాద్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ కేతిరెడ్డి యాకుబ్ రెడ్డి సేవ పతకం లభించింది. 79వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా పోలీస్ సేవ పతకాన్ని మానుకోట జిల్లా ఎస్పీ రాంనాద్ కోకెన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా యాకుబ్ రెడ్డి మాట్టాడారు. అంకిత భావంతో విధులు నిర్వహించినందుకు గుర్తింపుగా మెడల్ అందుకోవటం అనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి ఉత్సాహాన్నిస్తుందన్నారు. తనపై నమ్మకాన్ని ఉంచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెటుకోవడానికి ఎలపుడూ కృషి చేసానని పేరోన్నారు.

# మంత్రి కొండా సురేఖను కలిసిన శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ తూర్పు శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి కొండా సురేఖను శనివారం ఆమె నివాసంలో వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మధుర శ్రీకృష్ణ ప్రతిమను బహుకరించారు. అనంతరం, 34వ డివిజన్‌లోని శివనగర్ ప్రాంత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే ఆ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిరుపేద కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించాలని కోరుతూ శామంతుల శ్రీనివాస్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా డివిజన్ నాయకులు రావుల విజయ రాంచందర్, కొర్రపాటి రాధిక, నాయకులు పట్టూరి సుధాకర్, ముత్తినేని మధువర్మ, తిరునగిరి వెంకన్న, శామంతుల శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గుడికి విరాళం అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో త్వరలో రానున్న కార్తీకమాసం సందర్భంగా నవగ్రహ శివలింగ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమానికి పలువురు దాతలు తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా గణపురం మండలానికి చెందిన సంద నివేదిత, కుమారస్వామి దంపతులు రూ.20,000 విరాళాన్ని అందజేశారు. అలాగే, మంద స్వప్న, చంద్రమౌళి గౌడ్ దంపతులు కూడా రూ.20,000 విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# బొగ్గులవాగు ప్రాజెక్ట్ కు జలకళ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఎడ్లపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గల మధ్య తరహా బొగ్గుల వాగు ప్రాజెక్ట్ జల కళను సంతరించుకుంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కు ఎగువ నుంచి భారీ ఎత్తున వరద రావడంతో ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండి మత్తడి పోస్తుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో ఆయకట్టు 5150 ఎకరాలకు రెండు పంటలకి పూర్తి స్థాయిలో నీరు అందనుంది. ప్రాజెక్టుకు జలకళ రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపి చిక్కుల్లో పడొద్దు

## ◆ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరిక




**వరంగల్ వాయిస్, క్రైం :** వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపి చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వాహనదారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్నారని, అటువంటి ప్రమాదాల్లో వారు స్వయంగా ప్రాణాలు కోల్పోయే ఘటనలు కూడా సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా అనేక కుటుంబాలు తీరని నష్టాన్ని చవిచూస్తున్నాయని, ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున డ్రంక్ అండ్ డ్రైవ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులకు చిక్కిన వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించబడుతుంది. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, వారి తప్పిదానికి తగిన శిక్షలు విధించబడుతున్నాయని కమిషనర్ తెలిపారు. ఆగస్టు 09 నుంచి వారం రోజుల్లో జరిగిన తనిఖీల్లో మొత్తం కేసులు 324 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 16 మంది వాహనదారులకు కోర్టు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించగా, మిగితా మొత్తం వాహనదారులు కోర్టు కు రూ. 3,95,400/- జరిమానా చెల్లించారు. ఇందులో హనుమకొండ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 121 కేసులు నమోదు కాగా, నలుగురుకి జైలు శిక్ష పడగా, 1,36,400/-రూపాయల జరిమానాను కోర్టు చెల్లించారు. ఇదే రీతిలో కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో కేసుల 106 కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష పడగా రూ. 1,69,300/- జరిమానా, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 97 కేసుల్లో ఐదుగుకి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో రూ.89,700 జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ వాహనదారులకు "మీ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. మీ తప్పిదం వల్ల ఇతరుల ప్రాణాలు పోవచ్చు. కొందరు శాశ్వతంగాను, మరికొందరు జీవితాంతం మానసిక లేదా శారీరక వికారాలతో బాధపడే పరిస్థితి ఎదుర్కొంటారు. వాహనదారులు మీ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ పోలీసుల ప్రధాన లక్ష్యం" అని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# మల్లూర్ మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక




**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల ప్రెస్ క్లబ్ పాత్రికేయుల నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం మండలంలోని కొయ్యూరు ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా పాలిశెట్టి నరేష్(ఆంధ్రప్రభ) , ప్రధాన కార్యదర్శిగా దెంచనాల తిరుపతి(మనం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# వైద్య ఆరోగ్యశాఖలో వెంటనే ఉద్యోగ ప్రకటనలు చేయాలి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఉన్నటువంటి వివిధ ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి కేవలం 4 కేటగిరీలకు సంబంధించిన పోస్టులను మాత్రం ఎంహెచ్ఎస్ఆర్బీ రిక్రూట్ మెంట్ బోర్డ్ ద్వారా నియమించారు. మిగతా ఆల్ కేడర్స్ విషయంలో సంవత్సరాల తరబడి ఉద్యోగ ప్రకటన చేయకపోవడం వలన వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ద్వారా ఏళ్ల తరబడి ఉద్యోగాలు పనిచేస్తున్న వారి ఆశలు అడవి కాసిన వెన్నెల లాగా మారాయి. ప్రకటన ఆలస్యం కావడంతో దాదాపు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తూ వయసు పైబడి ఉద్యోగాల అర్హత కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం వలన నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. కేవలం 4 కేటగిరీలు మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ మినహా ఇతర పోస్టులు అనగా ఫిజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్, డాటా ఎంట్రీ ఆపరేటర్/ అకౌంటెంట్స్, డెంటల్ టెక్నీషియన్, ఆప్తాలమిక్ ఆఫీసర్స్, ఎన్ ఆర్ సీ కౌన్సిలర్స్, ఆర్ కేఎస్కే కౌన్సిలర్స్, ఎన్ సీడీ కౌన్సిలర్స్, సైకాలజిస్ట్, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్, మేల్ నర్సింగ్ ఆర్డర్ లీ, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ లీ, ఆయూష్ ఎస్ఎన్ఓ తదితరాలు పోస్టుల నోటిఫికేషన్ ప్రకటనలు జారీ చేయకుండా కాలయాపన చేయడం వల్ల అర్హులైనటువంటి ఎంతోమంది నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సిన పరిస్థితిలో దాపరిచాయని పలువురు నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా నోటిఫికేషన్ విడుదల చేసి కాంటాక్ట్ వారికి మొదటి ప్రాధాన్యత అండ్ ఔట్ సోర్సింగ్ సెకండ్ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి ఉద్యోగికి వర్తింపజేసేటట్టుగా ఉండాలని ఉద్యోగాల సంఘ నాయకులు, మిగతా నిరుద్యోగులు, జాతీయ ఆరోగ్య మిషన్ జేఏసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# ఠాకూర్ ధరమ్ సింగ్ కు అవార్డు




**వరంగల్ వాయిస్, ఢిల్లీ:** మానవత్వ సేవలకు గుర్తింపుగా న్యూ ఢిల్లీలోని "ఐ కెన్ ఫౌండేషన్" నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఠాకూర్ ధరమ్ సింగ్‌కు 'హ్యూమానిటేరియన్ ఎక్సెలెన్స్ 2025' జాతీయ అవార్డు లభించింది. ద్వారకాలోని రేడిసన్ బ్లూ హోటల్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం, ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యులు సంతోష్ బగడోరియా చేతుల మీదుగా ధరమ్ సింగ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సమాజ సేవలో భాగంగా 53 సార్లు రక్తదానం చేసినందుకు గాను ఈ అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ప్రతి సంవత్సరం సుభాష్ చంద్రబోస్ జయంతి (జనవరి 23), ప్రపంచ రక్తదాన దినోత్సవం (జూన్ 14), భగత్ సింగ్ జయంతి (సెప్టెంబర్ 27) వంటి ప్రత్యేక దినాల్లో తాను రక్తదానం చేస్తానని ఈ సందర్భంగా ధరమ్ సింగ్ తెలిపారు.

# బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

## వరంగల్ వాయిస్ కథనానికి స్పందన



**వరంగల్ వాయిస్, దామెర :** ఇటీవల దామెర మండలంలోని కోగిల్వాయి గ్రామానికి చెందిన పోటు సునీతకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పత్రాలు పొందింది. అయితే, ఊర్లో ఇంకో సునీత ఉండడంతో అధికారులు ఈ పత్రాలను పొరపాటున ఇచ్చారని తెలుసుకుని, కొత్త ఇంటి నిర్మాణ పనులను మధ్యలోనే ఆపేశారు. ఈ విషయాన్ని 'వరంగల్ వాయిస్ దినపత్రిక' "గూడు కోసం గోడు" అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తను చూసిన స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, అధికారులు జోక్యం చేసుకుని పోటు సునీతకు న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో, అధికారులు వెంటనే స్పందించి ఆమెకు కొత్త ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందించారు. ఈ సహాయానికి సునీత, పత్రిక విలేకరులకు, అధికారులకు, ఎమ్మెల్యే రేవూరు ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ 41వ డివిజన్‌లోని పలు కాలనీలను సందర్శించారు. ఇటీవల మరణించిన పసునూరి బుచ్చమ్మ, వడ్నాల దశరథం, మహమ్మద్ యాకుబ్మియా, మహబూబ్, వనపర్తి దయాకర్ కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్, సీనియర్ నాయకులు మంద సతీష్, పోలేపాక భాస్కర్, బొల్లం సంజీవ శ్రీ పాల్, పుట్ట రాధిక, మైనారిటీ నాయకులు మహమ్మద్ అలీ, అజర్, హైమద్, నజీర్, షరీఫ్, ఆఫ్రినా, అలాగే ముఖ్య నాయకులు బాలు, విజయ్, కృష్ణ, చంద్రయ్య, సాగర్, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** హనుమకొండలోని బాలసముద్రంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ సతీమణి రేవతి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు వారి పిల్లలు కృష్ణవ్ భాస్కర్, కృషిక భాస్కర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ తో పాటు ఖలీల్, నయీమ్ జుబేర్, రామ్మూర్తి, చాగంటి రమేష్, ఫాజిల్, సర్దార్, యాకుబ్, దేవమ్మ, సారిక, పావని, రవి, మూటిక రాజు, విద్యార్థి నాయకులు భైరపాక ప్రశాంత్, పబ్బోజు శ్రీకాంత్ చారి, సందీప్ యాదవ్ వంటి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 17న ఘనంగా వడ్డేపల్లి బోనాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ఆదివారంవడ్డేపల్లి పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరిపై గ్రామ దేవతల ఆశీస్సులు ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి సంవత్సరం ఈ బోనాల పండుగను నిర్వహిస్తున్నామని చెప్పారు. బోనాల పండుగ సందర్భంగా పలారాల బండి ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. అన్ని కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అందరూ ఈ పండుగలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఆయన స్వయంగా పండుగ ఏర్పాట్లను పరిశీలించారని తెలిపారు.

# 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

## ◆ 24న జరిగే రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మధ్య భారతంలో జరుగుతున్న 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఈ సదస్సు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, హనుమకొండ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవీ చలపతిరావు, ప్రొఫెసర్ హరగోపాల్, డి. నరసింహారెడ్డి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, పీడీఎం జిల్లా అధ్యక్షులు గుడికందుల క్రాంతి, సీఎల్‌సీ జిల్లా నాయకులు కాంపల్లి ప్రవీణ్, టీడీఎఫ్ నాయకులు పోరిక ఉదయ్ సింగ్ మాట్లాడుతూ, మధ్య భారతంలో అమలు చేస్తున్న 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే, 1996 'పీసా' చట్టం, 2006 అటవీ హక్కుల చట్టంలను అమలు చేయాలని, మావోయిస్టులు, ఆదివాసులపై జరుగుతున్న హత్యాకాండను ఆపాలని, బస్తర్‌లో ఏర్పాటు చేసిన సాయుధ పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని కోరారు. ఉద్యమకారుల, ఆదివాసుల జీవించే హక్కును కాపాడాలని, కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, అరుణోదయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నలిగంటి విజయ్ పాల్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు భైరబోయిన ఐలయ్య, పీవైఎల్ జిల్లా నాయకులు గంధ్రతి హరిబాబు, ఏఐకేఎంఎస్ కార్యవర్గ సభ్యులు ఇనుముల కృష్ణ, గద్దల సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సెస్సీ టాపర్స్‌కు ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గట్లకానిపర్తి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గ్రామ అభివృద్ధి కమిటీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రోత్సహించారు. మొదటి ర్యాంకు 484 మార్కులు సాధించిన బొమ్మకంటి హర్షత్‌కు (రాజేందర్ కుమారుడు) దాత డాక్టర్ తిరునగిరి మనోహర స్వామి చేతుల మీదుగా రూ. 1500 నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. రెండవ ర్యాంకు 461 మార్కులు సాధించిన సుద్దాల శివసాయికి (రామకృష్ణ కుమారుడు) దాత బొమ్మకంటి సురేష్ తరపున బొమ్మకంటి పోశాలు రూ. 1000 నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 18న ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

## వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి ఉత్సవాలకు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధిగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నియమితులయ్యారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ వేడుకలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తాను ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీ, గౌడ సామాజిక వర్గాలకు అందిస్తున్న సేవలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బాధ్యత తనపై మరింత భారాన్ని పెంచిందని పేర్కొంటూ, జయంతి ఉత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గౌడ సోదరులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యావేత్తగా, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, సామాజిక వేత్తగా గుర్తింపు పొందారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ వాయిస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, ఇది బీసీలకు తీరని ద్రోహం చేయడమేనని ఆయన హెచ్చరించారు. శాసనసభ, శాసనమండలిలో బీసీ రిజర్వేషన్ బిల్లులను అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిన తర్వాత, అన్ని రాజకీయ పార్టీల, బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వెంకట్రాములు ఆరోపించారు. రాష్ట్రంలోని బీజేపీ శాసనసభ్యులు అసెంబ్లీలో బిల్లులను బలపరిచి, ఇప్పుడు మాట మార్చడం దగుల్బాజీతనమేనని ఆయన విమర్శించారు. కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నం చేయకపోవడం బీసీల పట్ల వారి చిత్తశుద్ధిని బయటపెడుతుందని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆగస్టు 25న హైదరాబాద్‌లో సత్యాగ్రహ దీక్ష చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తేవాలంటే ఢిల్లీలో దీక్ష చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బీసీలకు ద్రోహం చేసే రాజకీయ పార్టీలకు తగిన సమయంలో గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

# బస్టాండ్ పరిధిలో ట్రాఫిక్ కు అంతరాయం కలిగించొద్దు

## హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ జిల్లా బస్టాండ్ సర్కిల్‌లోని ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపే ప్రైవేట్ వాహనాల యజమానులు, డ్రైవర్లకు హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే డయల్ 100కి లేదా హనుమకొండ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# వైభవోపేతంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, జనగామ:** విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ట్యాబ్ది స్థాపన దివస్, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జనగామలో ఘనంగా జరిగాయి. జనగామ జిల్లా విభాగ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం ఈ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు రాధాకృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. దాదాపు 80 మంది చిన్నారులు రాధాకృష్ణులుగా ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కొందరు చిన్నారులు భగవద్గీత శ్లోకాలు, పాటలు, కీర్తనలు, కథలతో ప్రేక్షకులను అలరించారు. పండగ వాతావరణంలో చిన్నారులందరూ కలిసి నృత్యాలు చేయగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యంగా, 9 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు బాలకృష్ణులుగా వేసి బుడిబుడి అడుగులతో అందరినీ ముగ్ధులను చేశారు. అనంతరం, చిన్నారులు, యువతీ యువకులు ఉట్టి కొట్టి శ్రీకృష్ణ తన్మయత్వంలో మునిగిపోయారు. దేవాలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవాళికి ధర్మ సూత్రాలను బోధించిన జగద్గురువు అని అన్నారు. యువత ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవాలని, ధర్మ రక్షణకు ముందు నిలవాలని పిలుపునిచ్చారు. పిల్లలు ప్రతిరోజు భగవద్గీత పఠించాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రిపురారి పద్మ, పాశం శ్రీశైలం, కందాడి మల్లారెడ్డి, యెలసాని రాంబాబు, అభిషేక్ గౌడ్, చిలువేరు హర్షవర్ధన్, బొల్లు జాన్సి, ఇట్టబోయిన రాజు, సత్యం, కుందారపు బైరునాథ్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమౌళి, సంజీవరెడ్డి, నాగరాజు, సాయిసుజీత్, రవి రెడ్డి, పెద్ద సంఖ్యలో చిన్నారుల తల్లిదండ్రులు, దేవాలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

# దుగ్యాల జయంతి సందర్భంగా అన్నదానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మండల కేంద్రంలోని స్థానిక గెస్ట్‌హౌస్‌లో మాజీ శాసనసభ్యుడు దుగ్యాల శ్రీనివాసరావు జయంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. దుగ్యాల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్ ఈ మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు రామసహాయం కిషోర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, మెరుగు మల్లేశం గౌడ్, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజలకథే నా ఆత్మకథ’ పుస్తకావిష్కరణ

**బండారు దత్తాత్రేయ స్వీయ రచన**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హర్యానా మాజీ గవర్నర్, సీనియర్ రాజకీయ నాయకుడు బండారు దత్తాత్రేయ రచించిన ‘ప్రజలకథే నా ఆత్మకథ’ పుస్తకావిష్కరణ శనివారం హనుమకొండలో ఘనంగా జరిగింది. ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఫోరం కన్వీనర్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సమ్మిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఈ పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త, సహృదయ సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ గన్నమరాజు గిరిజామనోహర్ బాబు సమీక్షిస్తూ ఒక సామాన్య కుటుంబం నుంచి గవర్నర్ స్థాయికి ఎదిగిన దత్తాత్రేయ రాజకీయ జీవితాన్ని వివరించే ఈ పుస్తకం కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న యువ రాజకీయవేత్తలకు ప్రేరణ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ తో బండారు దత్తాత్రేయకు ఉన్న అనుబంధాన్ని స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు వివరించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, వన్నాల శ్రీరాములు, మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, స్వయం సేవకులు, దత్తన్న అభిమానులు, నగరంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

**వన్నాలకు పరామర్శ..**

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములును శనివారం బండారు దత్తాత్రేయ పరామర్శించారు. వన్నాల శ్రీరాములుకు ఇటీవల సతీ వియోగం కలిగిన విషయం తెలిసిందే. కాగా హన్మకొండలోని అడ్వకేట్స్ కాలనీలోని వన్నాల శ్రీరాములును ఆయన స్వగృహంలో బండారు దత్తాత్రేయ ఓదార్చారు. అనంతరం దివంగత వన్నాల విజయలక్ష్మీ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోహార్ వన్నాల విజయలక్ష్మీ, అమర్ రహే వన్నాల విజయలక్ష్మీ అంటూ నినాదాలు చేశారు. పార్టీ పరంగా వన్నాల శ్రీ రాములు ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని బండారు దత్తాత్రేయ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వన్నాల కుటుంబ సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ, డాక్టర్ వన్నాల పావన, వన్నాల జెతిన్ సాయి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ లోకసభ సభ్యులు ఆజ్మీరా సీతారాం నాయక్, మాజీ శాసన సభ్యులు తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, మార్తినేని ధర్మారావు, గేట్స్, షిప్స్ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు మంద అయిలయ్య, నాగపురి రాజమౌళి, రావు అమరేందర్ రెడ్డి, రావు పద్మ, ఎడ్ల అశోక్ రెడ్డి, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ పండుగలకు ఆంక్షలు వద్దు

- **పోలీసులు సహకరించాలి**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలో వినాయక మండపాలను ఏర్పాటు చేయు భక్త మండళ్లకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా దిగ్విజయంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరుతూ శనివారం బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో వరంగల్ ఏసీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ చారిత్రాత్మక మన ఓరుగల్లు నగరంలో అనేక సంవత్సరాలుగా వినాయక చవితి పండుగను మత సామరస్యంతో విజయవంతంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఈ పండుగను యూత్ అసోసియేషన్లు, భక్తమండలి, కాలనీ సంఘాలు కమిటీలుగా ఏర్పడి వారి వారి ప్రాంతాలలోని ప్రధాన కూడలిలో మండపాలను ఏర్పాటు చేసి, నవరాత్రులు పూజలు చేసి మన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కావున వారి ప్రాంతాలలో ఏర్పాటు చేసే మండపాలకు ఎటువంటి అసౌకర్యం, ఆటంకాలు జరగకుండా తగిన వసతులు కల్పించి భక్తి భావంతో వినాయక చవితి నవరాత్రులు దిగ్విజయంగా జరుగుటకు అన్ని విధాల సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా బైరి నాగరాజు, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, జిల్లా నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్తా, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కొంతం సంగీత్, సీతా నాగరాజు, వెనిశెట్టి రోహిత్, ధర్మపురి రామారావు, గబ్బేట ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు సిటిజన్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అతిరధ మహారధుల సమక్షంలో ‘ప్రజల కథే నా ఆత్మకథ’ పేరుతో మాజీ కేంద్ర మంత్రి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్రను ఆవిష్కరించిన కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొన్నారు. హోదాలకు, పదవులకు అతీతంగా మానవతా విలువలతో జీవనాన్ని ఎలా కొనసాగించాలో ఈ పుస్తకంలో పేర్కొన్నట్లు వివరించారు.

# దత్తాత్రేయకు ఘన సన్మానం

**పాల్గొన్న పద్మశాలీ జర్నలిస్టులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వరంగల్ పర్యటనలో భాగంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములును శనివారం పరామర్శించారు. వన్నాల శ్రీరాములుకు ఇటీవల సతీ వియోగం కలిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు వేముల నాగరాజు, ఉపాధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణ, కోశాధికారి సదానందం బండారు దత్తాత్రేయకు శాలువ కప్పి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఫోటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.







# భద్రకాళికి బస్ సౌకర్యం


**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి కొండా సరేఖ ఆదేశాల మేరకు భద్రకాళీ అమ్మవారి దర్శనమునకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి వయా భద్రకాళీ దేవస్థానం మీదుగా కాజీపేట రైల్వే స్టేషన్ వరకు టీఎస్ఆర్ టీసీ బస్సు నడుపుటకు నిర్ణయించి కొత్త బస్సును శనివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, దేవాలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, గాండ్ల స్రవంతి, మోతుకూరి మయూరిరామేశ్వరావు, ఓరుగంటి పూర్ణచందర్, బింగి సతీష్, కార్యనిర్వహణాధికారి రామల సునీత, భద్రకాళి శేషు అయ్యగారు, దేవాలయ అర్చకులు, సిబ్బంది, ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజరు ధరమ్ సింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ప్రణవ్

**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీకృష్ణుడిని కోరుకున్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఉదయం తన ఇంట్లో కూడా కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నట్లు ప్రణవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ అయాజ్, టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్, నిర్వాహకులు రాజు యాదవ్, పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# బుట్ట బొమ్మ బ్యాడ్‌లక్



ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగిన పూజా హెగ్డే, ప్రస్తుతం సరైన హిట్ కోసం కష్టాలు పడుతున్నారు. 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆమె నటించిన చాలా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. దీంతో ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.అల వైకుంఠపురములో' తర్వాత పూజా నటించిన సినిమాలు వరుసగా నిరాశ పరిచాయి. అఖిల్‌తో చేసిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', ప్రభాస్‌తో చేసిన 'రాధే శ్యామ్', విజయ్‌తో చేసిన 'బీస్ట్', రామ్ చరణ్‌తో చేసిన 'ఆచార్య' సినిమాలు బాక్సాఫీస్ వద్ద చతికిలపడ్డాయి. తెలుగులోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమెకు కలిసి రాలేదు. 'సర్కస్' , దేవా, 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రాలు కూడా విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రతికూల స్పందన పొందాయి. అంతేకాకుండా, తమిళ నటుడు సూర్యతో చేసిన 'రెట్రో' కూడా నిరాశనే మిగిల్చింది. తాజాగా, ఆమె స్పెషల్ సాంగ్ చేసిన 'కూలీ' చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాలో 'మోనికా' పాటలో ఆమె డ్యాన్స్ అందరినీ మెప్పించినప్పటికీ, సినిమాలో ఆ పాట ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు నిరాశపడ్డారు. దీనిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా జరిగింది. ఈ వరుస పరాజయాలు పూజా హెగ్డే కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తిరిగి ఫామ్‌లోకి రావడానికి ఆమెకు ఒక పెద్ద హిట్ ఎంత అవసరమో ఈ పరాజయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆమె చేతిలో విజయ్ జన నాయగన్ సినిమా ఒక్కటే ఉంది. మరి భవిష్యత్తులో ఆమె లక్ ఎలా ఉంటుందో చూడాలి.

# చిరంజీవి బర్త్‌డేకు విశ్వంభర టీజర్ విడుదల?

ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులు మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో విశ్వంభర భారీ బడ్జెట్ తో వస్తోంది. వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ థ్రిల్లర్ గా తీసుకొస్తున్నారు. జెట్ స్పీడ్ తో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా నుంచి భారీ అప్డేట్ రాబోతోంది. మూవీ టీజర్ ను ఇప్పటికే కట్ చేసినట్టు– తెలుస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్టు– తెలుస్తోంది. త్వరలోనే రిలీజ్ డేట్ ను ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆర్ ఆర్ కూడా కంప్లీట్ అయిపోయిందంట. గతంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ పై కొన్ని విమర్శలు వచ్చాయి. వీఎఫ్ ఎక్స్ వీక్ గా ఉందనే ప్రచారం జరిగింది. అందుకే ఈసారి ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూస్తున్నారంట.

వశిష్ట అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే మెగా ఫ్యాన్స్ మెచ్చే విధంగా టీజర్‌ను కట్ చేయించినట్టు తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా చేస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత కాలం నాటికి వెళ్లే సీన్స్ కూడా ఉంటయాంటున్నారు. వింటేజ్ చిరు లుక్ గురించి ఇప్పటికే చర్చ జరుగుతోంది. కాబట్టి చిరంజీవి లుక్ ఈ సినిమాలో మరింత ఇం–టె–స్ట్ ను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈ టీజర్ తో మెగా ఫ్యాన్స్ ను సంతృప్తి పరిచేసి మూవీపై భారీగా అంచనాలు పెంచాలని చూస్తున్నారు. సెప్టెంబర్ లోనే మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ మొన్నటి వరకు నడిచింది. కానీ ఇప్పుడు అక్టోబర్ కు షిఫ్ట్ అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.






# త్వరలో ఆఫ్రికాకు రాజమౌళి

## అక్కడే కీలక సన్నివేశాల చిత్రీకరణ



మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్స్ వచ్చాయి. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి స్వయంగా ఈ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడిరచారు. కేవలం కొన్ని ప్రెస్ మీట్‌లు లేదా అప్‌డేట్స్ ద్వారా సినిమా కథాంశాన్ని పూర్తిగా వివరించలేమని రాజమౌళి స్పష్టం చేశారు. సినిమా గురించి అప్పటికప్పుడు ఏది అప్‌డేట్ ఇవ్వాలో అదే ఇస్తామని తెలిపారు. దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా అక్కడ ప్లాన్ చేసిన షూటింగ్ వాయిదా పడిరది. సెప్టెంబర్ రెండో వారంలో సౌత్ ఆఫ్రికాలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ ఆలస్యం కావడంతో, ఈ మధ్య హైదరాబాద్‌లోనే హీరోయిన్‌తో కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ప్రస్తుతం షూటింగ్స్ నిలిచిపోయిన నేపథ్యంలో సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ కోసం బిజీగా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో మునిగి పోయారు రాజమౌళి. ఈ క్రమంలో బాడీ ట్రాన్స్ఫర్మేషన్ మీద మహేష్ ఫోకస్ పెట్టాడు. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, రాజమౌళి స్థాయికి తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబుతో పాటు– పృథ్వీ రాజ్ సుకుమారన్ తో పాటు– ప్రియాంక చోప్రా కీలక పాత్రలలో నటిస్తున్నారు.



# త్వరలోనే నాగ్ కొత్త సినిమా ప్రకటన

చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటే.. కింగ్ నాగార్జున మాత్రం గట్టి కంబ్యాక్ కోసం కష్టపడుతున్నారు. 2022లో వచ్చిన బంగార్రాజు తర్వాత నాగ్ పెద్దగా హిట్ చూడలేదు. బ్రహ్మాస్త్ర హిట్ అయినప్పటికీ అది రణబీర్, అమితాబ్ బచ్చన్ ఖాతాలోకి చేరిపోయింది. ఆ తర్వాత వచ్చిన ది గోస్ట్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా.. నా సామి రంగా పర్లేదనిపరచింది. కింగ్ హీరోగా కాస్త బ్రేక్ ఇచ్చి.. సపోర్టింగ్ అండ్ స్పెషల్ రోల్స్‌కు షిఫ్టయ్యారు. నాగార్జున ఇటీ–వలే ధనుష్ 'కుబేర'తో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ సినిమాలో నాగ్ విలన్‌గా నటించారు. అయితే కింగ్ కొత్త సినిమా విషయంలో మాత్రం క్లారిటీ– రావడం లేదు. కానీ ఇప్పటికే నాగ్ కొత్త సినిమాపై గట్టిగా కసరత్తులు చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళ దర్శకుడితో మైల్‌స్టోన్ మూవీ చేయబోతున్నట్టు–గా తెలుస్తోంది. 'రా.కార్తీక్' దర్శకత్వంలో నాగార్జున సినిమా చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను 'కింగ్ 100' వర్కింగ్ –టైటిల్‌తో మొదలు పెట్టబోతున్నారు. తాజా అప్డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు– తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను నాగ్ తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటు–న్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం.

# ఉట్టి కొట్టిన కృష్ణయ్య





- ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు
- పాఠశాలలు, దేవాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు






**వరంగల్ వాయిస్, డెస్క్ :** శ్రీ కృష్ణ జన్మదిన వేడుకలను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లోని చిన్నారులను కృష్ణుడి మాదిరిగా అలంకరించి సంబుర పడ్డారు. శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో నిర్వహించిన ఆట పాటలు అందరినీ అలరించాయి. పాఠశాలల్లో చిన్నారులతో రాధా కృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు భగవద్గీత శ్లోకాలు, పాటలు, కీర్తనలు, కథలతో అలరించారు. పండగవాతావరణంలో చిన్నారులందరూ కలిసి నృత్యాలు చేశారు. ప్రదర్శనలో ఆకర్షణీయంగా నిలిచిన పలువురు విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఏడాది లోపు చిన్నారులు సైతం బాలకృష్ణుడిగా బుడిబుడి అడుగులతో ముగ్ధులను చేశారు. చిన్నారులు, యువతీ యువకులు ఉట్టి కొట్టి ఆనందకేళిలో పాల్గొని తమని తాము శ్రీకృష్ణుడితన్మయత్వంతో మైమరచిపోయారు. ఎస్ఆర్ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సామల స్వరూప, కరస్పాండెంట్ సామల సుధాకర్, డైరెక్టర్లు సామల మురళీకృష్ణ, లావణ్యలు పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణుడు జగద్గురువుగా మహత్తర గీతోపదేశం చేసి, మానవాళికి ధర్మసూత్రాలను బోధించారని, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ, ధర్మసంస్థాపన కోసం అవతరించిన నారయణుడు మహాభారతాన్ని నడిపించాడన్నారు. కృష్ణుడి ఆరాధన మాత్రమే కాదు ఆయన చూపిన ధర్మమార్గంలో యువత నడవాలన్నారు. ధర్మ రక్షణ కోసం ముందు నిలవాలని అన్నారు. కృష్ణుడి జీవితమే ఆదర్శంగా ప్రతీ రోజు భగవద్గీత పఠించాలన్నారు.



# ఎల్లవేళలా అండగా ఉంటాం

- మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో ప్రజలనుంచి వినతుల స్వీకరణ

**వరంగల్ వాయిస్, మట్టేవాడ :** వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వరంగల్ ప్రజలు ఏ సమస్య ఉన్నా ఎవరి వద్దకు వెళ్లి పైరవీలు చేయవలసిన అవసరం లేదని, నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చన్నారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేయడమే తమ లక్ష్యం అని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీవర్ష సూచన కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ కోరారు. ఏలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని, కొండా దంపతులు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటారని, కార్యకర్తలను, నాయకులను కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకొని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ముఖ్య నేతల సమావేశంలో ఇనగాల

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ శనివారం నిర్వహించిన ఉప ఎన్నిక సన్నాహక సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ బూత్ ఇంచార్జులు, ముఖ్య నేతలతోపాటు వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో అజారుద్దీన్, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట స్వామి, బూత్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com